క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన నిత్యాన్నదానానికి ఓ దాత నగదు విరాళం చేశారు. ఆదివారం బెంగళూరుకు చెందిన రవికాంత్ కాణిపాకం ఆలయానికి వచ్చారు. అనంతరం నిత్యాన్నదానానికి రూ.లక్ష నగదును ఆలయ అధికారులకు విరాళం అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు ఆయనకు స్వామివారి దర్శనం, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కోతలకాల పండుగ వేడుకలు



మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌ను సన్మానిస్తున్న పాస్టర్లు

కాణిపాకం: పాకాల చర్చిలో ఆదివారం జరిగిన కోతలకాల పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పాస్టర్లు ప్రేమ్‌కుమార్, రాఘవులు, అరుల్ సెల్వి, స్నేహమాలిని, సెబస్టిన్, తదితరులు ఆయనను సన్మానించారు.

వరసిద్ధుడి సేవలో పాట్నా హైకోర్టు జడ్జి



స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. దగ్గర ఉండి స్వామివారి దర్శనం కల్పించారు. వేద ఆశీర్వచనంతో పాటు ఏఈఓ కృష్ణారెడ్డి ఆయనకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

భద్రకాళమ్మ అమ్మవారికి పూజలు



గుడిపాల: ప్రత్యేక అలంకరణలో భద్రకాళమ్మ అమ్మవారు.

గుడిపాల: మండలంలో నరకచతుర్థిని ఘనంగా జరుపుకున్నారు. నరహరిపేట సమీపంలో గల భద్రకాళమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

జీఎస్టీ అవగాహన కార్యక్రమాల ముగింపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న జీఎస్టీ అవగాహన కార్యక్రమాలు ఈ నెల 19వ తేదీతో ముగిశాయని డీఆర్‌ఓ మోహన్ కుమార్ అన్నారు. ఆదివారం ముగింపు కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని జ్యోతిరావు పూలే భవనంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ వన్ నేషన్, వన్ ట్యాక్స్ అమలు చారిత్రాత్మకమన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ శ్లాబులను తగ్గించడంతో పన్నులు తగ్గాయన్నారు. కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, నగర మేయర్ అముద, చుడా చైర్మన్ హేమలత, కమర్షియల్ ట్యాక్స్ అధికారి రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు జలహారతి



గుడిపాల: చెరువుకు జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే

గుడిపాల: వర్షాలు సమృద్ధిగా పడడంతో చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లడంతో ఆదివారం ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ వసంతాపురం బంగారక్కచెరువు, గుడిపాల నారాయణరెడ్డి చెరువులకు జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా మారారని, రైతులు బాగుంటే రాష్ట్రం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ హేమలత, డెప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, ఎమ్మెల్యే తల్లిదండ్రులు, మండల నాయకులు పాల్గొన్నారు.

ఎవరు జవాబుదారి?

పండుగల నాడు పల్లెలకు వెళ్దాం అంటే జనం భయపడుతున్నారు. రోడ్లన్నీ గోతులతో నిండి రోడ్లు ఛిద్రమయ్యాయి. వర్షానికి పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. పలుచోట్ల తారు లేచిపోయి.. బురదమయమయ్యాయి. దీంతో పండుగ వేళ పల్లెలకు వెళ్దామంటే.. రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయి. ప్రధానంగా యాదమరి మండలం చెన్నారెడ్డిపల్లి నుంచి బుడితిరెడ్డిపల్లి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. రాకపోకలకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇక దీపావళి పండుగకు ఊరొచ్చిన జనం రోడ్ల దుస్థితిని చూసి ఛీకొడుతున్నారు. పాలకులు, ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- పండుగలకు ఊర్లకు వెళ్లేందుకు వచ్చిన వారికి నరకం
- గోతులతో దర్శనమిస్తున్న రోడ్లు
- ఇంత అధ్వానంగా ఉంటే వెళ్లేదెట్లా అంటున్న జనం

చిత్తూరు అర్బన్/యాదమరి : చిత్తూరు నియోజకవర్గంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. చిత్తూరు నగరంతో పాటు గుడిపాల, చిత్తూరు గ్రామీణ మండలాల్లో పలు రోడ్లు బురద, వర్షపు నీటితో దర్శనమిస్తున్నాయి. పండుగ రోజున సొంత ఊర్లకు వస్తున్న ప్రజలు రోడ్ల పరిస్థితి చూసి, గ్రామంలోకి వెళ్లడానికి కూడా బుద్ధి పుట్టడం లేదు.



చెన్నారెడ్డిపల్లి వద్ద గుంతలు పడి అధ్వానంగా ఉన్న రోడ్డు



బుడితిరెడ్డిపల్లి వద్ద వర్షానికి దెబ్బతిన్న తారురోడ్డు, గుడిపాల మండలం వెప్పాలమానుచేను గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి

దివ్యకాంతుల దీపావళి

చిత్తూరు రూరల్(కాణిపాకం): అమావాస్య చీకట్లను పారదోలి వెలుగులను పంచే పండగ దీపావళి. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ ఆనందోత్సాహంగా జరుపుకుంటారు. ఆది, సోమ, మంగళవారాల్లో దీపావళి పండుగను ఘనంగా జరుపుకోవడానికి చిత్తూరు వాసులు సిద్ధమయ్యారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. ఇక తమిళనాడు సంప్రదాయం ప్రకారం పండుగ జరుపుకోవడానికి చిత్తూరు వాసులు సిద్ధమయ్యారు. ఆదివారం నరక చతుర్థశి జరుపుకోగా.. సోమవారం, మంగళవారం దీపావళి సంబరాలు జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. లక్ష్మిపూజ, కేదారగౌరీ వ్రతంతో పాటు నోములు సోమవారం నుంచి మంగళవారం ఉదయం 9 గంటలోపు చేసుకునేలా ప్రజలు సిద్ధమయ్యారు. ఆపై గ్రహణం కారణంగా ఈసారి ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లు వేదపండితులు చెబుతున్నారు.

చర్చి వీధి, టపాసుల దుకాణాలు కిటకిట..

ప్రధానంగా చిత్తూరు నగరంలోని చర్చివీధి, బజారు వీధిలో దుకాణాలు కిటకిటలాడాయి. దారాలు, ప్రమిదలు, పూజకు కావాల్సిన సామగ్రిని మహిళలు భారీగా కొనుగోలు చేశారు. అలాగే చిత్తూరు నగరంలోని మార్కెట్‌యార్డులో పలు టపాసుల దుకాణాలు ఏర్పాటు చేశారు. కొనుగోలుదారులు, అమ్మకందారులు బిజీగా కనిపిస్తున్నారు. వర్షాలు లేకపోవడంతో టపాసుల వ్యాపారం జోరుగా సాగడంతో వ్యాపారులు కూడా ఊపిరి పీల్చుకుంటున్నారు.

అంధకారాన్ని తొలగించే దీపావళి

చిత్తూరు కార్పొరేషన్ : అంధకారాన్ని తొలగించి వెలుగులు నింపే ఈ దీపావళి పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు వెల్లడించారు. దీపావళి పండుగ ప్రతి ఇంట్లో శాంతి, సంపద, సంతోషాలను నింపాలని కోరారు. వెలుగులు పంచే పండుగను ప్రజలంతా ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

పండుగను సురక్షితంగా జరుపుకోవాలి

తవణంపల్లె: దీపావళి పండుగను ప్రజలు సురక్షితంగా జరుపుకోవాలని ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. దీపావళి పండుగ వెలుగుల పండుగగా, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. దీపావళి పండుగ సంప్రదాయ విలువలు, మన సంస్కృతి, స్నేహసంబంధాలకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలన్నారు. టపాకాయలు వాడేటప్పుడు సరైన తీసుకోవాలని, పిల్లలు పెద్దల పర్యవేక్షణలో వాటిని ఉపయోగించాలన్నారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంతోషంగా పండుగ జరుపుకోవాలని సూచించారు.

వైఫై కంటే వేగంగా పనిచేయాలి

– వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి



మాట్లాడుతున్న విజయానందరెడ్డి, సమావేశంలో గ్రామకమిటీ సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలు పార్టీ పటిష్టతకు వైఫై కంటే వేగంగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి అన్నారు. చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేట గ్రామంలో ఆదివారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆయన గ్రామ కమిటీ ఉద్దేశాలను వివరించారు. కమిటీ పని విధానం, పార్టీలో సభ్యుల పాత్ర, హోదా, విలువలను తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీకి గ్రామ కమిటీలే ఆయుధమన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టంగా పనిచేస్తే.. అధిష్టానం అంతా బలంగా ఉంటుందన్నారు. గ్రామ కమిటీలు బలపడితే భవిష్యత్ మనేదన్నారు. కష్టం వస్తే ఆదుకునేందుకు పార్టీ అండగా ఉంటుందని, అధికారంలోకి వస్తే కచ్చితంగా గ్రామకమిటీల అనుమతులతోనే అన్నీ జరుగుతాయన్నారు. ఇందుకు గ్రామ కమిటీలు చురుగ్గా పనిచేయాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ముఖ్యంగా మెడికల్ కాలేజీలను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం తీరును జనంలోకి తీసుకెళ్లాలన్నారు. తద్వారా భావితరాలకు జరిగే నష్టాన్ని చెప్పాలన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం ఇచ్చిన మోసపూరితమైన హామీలను జనంలోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ త్యాగరాజులు, నాయకులు సంపత్, ప్రతిమారెడ్డి, జీవీ చంద్రశేఖర్, గుణరెడ్డి, అబ్దుల్లా, ఫర్దుమా, మెహరున్నీషా, శివకుమార్, జవహర్, నౌషద్, శశికళ, వెంకటేష్, శివకుమార్, నరేష్, రాము, కలీం, సలీం, తాజ్, శ్రీనివాసులు, రాము, సుధీర్‌రెడ్డి, కన్నన్, ధర్మారెడ్డి, స్టాండ్లీ, సూర్య, ఆర్య, ప్రతాప్, ఇంతియాజ్, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

హరిబాబు మృతి తీరని లోటు



హరిబాబు (ఫైల్)

పూతలపట్టు(యాదమరి): వావిల్‌తోట సచివాలయ మాజీ కన్వీనర్ హరిబాబు మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు అని మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వావిల్‌తోటకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త హరిబాబు(45) గుండెపోటుతో మరణించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు తలపులపల్లి బాబురెడ్డితో కలిసి పలువురు నేతలు హరిబాబు మృతదేహానికి నివాళులు అర్పించారు. పార్టీ కోసం ఆయన అహర్నిశలూ కష్టపడ్డారని గుర్తుచేసుకున్నారు. వారి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రాఘవులు

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీఎన్జీఓ సంఘం, ఏపీ జేఏసీ సంఘాలు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తాయని ఏపీ ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షులు రాఘవులు అన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగకు ముందే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలిపారు. పట్టుబట్టి సీఎంతో రాష్ట్ర నాయకులు సమావేశం నిర్వహించారన్నారు. పీఆర్సీ, ఐఆర్ ఇచ్చి ఉంటే ఉద్యోగులకు మేలు జరిగేదన్నారు. అయితే నవంబర్ నుంచి ఒక డీఏ విడుదల చేయడం కాస్త ఊరటనిచ్చిందన్నారు. ఒక డీఏతో పాటు పలు డిమాండ్లను పరిష్కరించారని ఆయన తెలిపారు. సమావేశంలో పలువురు ఎన్జీవో సంఘం నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు



కల్లూరుపల్లె గుట్ట నుంచి ట్రాక్టర్‌లో అక్రమంగా మట్టి తరలిస్తున్న దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: మండలంలోని కల్లూరుపల్లెలోని ఓ గుట్ట నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారని స్థానికులు తెలిపారు. జేసీబీ, హిటాచీల సాయంతో అక్రమంగా మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా కేజీ సత్రానికి తరలిస్తున్నట్లు చెప్పారు. 20 ట్రాక్టర్ల ద్వారా మట్టిని తీసుకువెళ్లి రహదారి పక్కన డంప్ చేస్తున్నట్లు తెలిపారు. కేజీ సత్రం వద్ద రహదారి పక్కన డంప్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందంటున్నారు. ప్రకృతి వనరులను కొల్లగొట్టి పర్యావరణానికి ముప్పు కలిగించి, పర్యావరణ పరిరక్షణ చట్టాలకు వ్యతిరేకంగా మట్టిని తరలిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్నారు. సంబంధిత అధికారులు అక్రమ మట్టి రవాణాను అడ్డుకుని, పర్యావరణ రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కల్లూరుపల్లె నుంచి కేజీ సత్రానికి అక్రమ మట్టి తరలిస్తున్న విషయాన్ని స్థానిక తహసీల్దార్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.



కేజీ సత్రంలో రహదారి పక్కన మట్టిని డంప్ చేస్తున్న అక్రమార్కులు

థియేటర్ వద్ద గొడవ



చిత్తూరు నగరంలోని థియేటర్‌లో ప్రేక్షకులు, నిర్వాహకులకు మధ్య వాగ్వివాదం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని వేలూరు రోడ్డులో ఉన్న ఓ థియేటర్ వద్ద ఆదివారం రాత్రి ప్రేక్షకులు, థియేటర్ నిర్వాహకులకు మధ్య గొడవ చోటుచేసుకుంది. ప్రేక్షకులు సెకండ్ షోకు వచ్చి టిక్కెట్లు కొనుగోలు చేశారు. ఇందుకు డబ్బులు ఫోన్ రూపంలో చెల్లించారు. అయితే సీట్ల కేటాయింపు విషయంలో నిర్వాహకులకు, ప్రేక్షకులకు మధ్య మాటామాటా పెరిగింది. తీరా థియేటర్ నిర్వాహకులు డబ్బులు రాలేదని చెప్పేశారు. దీంతో ప్రేక్షకులు ఆగ్రహానికి గురయ్యారు. ఫోన్‌పే ద్వారా చెల్లింపు చేసింది చూపించారు. దీంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. వారి మధ్య మాటామాటా మరింత పెరిగింది. ప్రేక్షకులు థియేటర్ మూయిస్తామంటే.. నిర్వాహకులు మీవల్ల అయింది చేసుకోండంటూ కోపంతో ఊగిపోయారు. ఆపై ప్రేక్షకులు పోలీసులకు ఫోన్ చేసి విషయాన్ని వివరించారు. ఇంతలో కానిస్టేబుల్ అక్కడికి చేరుకుని సర్దుబాటు చేశారు. అయితే కాలక్షేపం కోసం వచ్చే ప్రేక్షకుల పట్ల ఇలా వ్యవహరించడం తగదని పలువురు ప్రేక్షకులు అసహనం వ్యక్తం చేశారు.

అడవి పందులతో తప్పని ఇక్కట్లు



గ్రామాల్లో తిరుగుతున్న వానరాలు

గుడిపాల: ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంట చేతికి వస్తుందనుకుంటున్న సమయంలో ఓవైపు వానరాలు.. మరోవైపు అడవిపందులు నాశనం చేస్తున్నాయి. దీంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. గుడిపాల మండలంలోని బొమ్మసముద్రం, చింతగుంటూరు, కోటూరు, వసంతాపురం, బసవాపల్లె గ్రామాల్లో రైతులు సాగు చేసిన బీన్స్, బెండ, వంకాయ, టమాటా, అరటి పంటలను వానరాలు నాశనం చేస్తున్నాయి.

దీంతో పాటు కొబ్బరిచెట్లలో ఉన్న కొబ్బరికాయలను కూడా ఉండనీయడం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే బండపల్లె, అడవిచేను, వెప్పాలమానుచేను, చిత్తపార ప్రాంతాల్లో అడవిపందులు వరిపంటను నాశనం చేసి ధ్వంసం చేస్తున్నాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో రైతన్నలు ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అడవిపందులు, వానరాలు పొలాల్లోకి రాకుండా ఉండేందుకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని రైతన్నలు డిమాండ్ చేస్తున్నారు.



అడవి పందుల దాడిలో నాశనమైన వరి పంట

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప

చౌడేపల్లె: మండలంలోని లద్దిగం గ్రామం వద్ద అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం భూమి పూజ చేశారు. లద్దిగం గ్రామ అంబేడ్కర్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తున్న కార్యక్రమానికి చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప, ఎస్‌కే యూనివర్సిటీ రిటైర్డ్ ప్రిన్సిపల్ వెంకటరెడ్డి, రిటైర్డ్ ఐఎఫ్‌ఎస్ అధికారి గౌతమి కలిసి విగ్రహ ఏర్పాటుకు పునాదిరాయివేశారు. అంబేడ్కర్ ఆశయ సాధనకోసం గ్రామ కమిటీ నిర్ణయం అభినందనీయమని కొనియాడారు. సర్పంచ్ కృష్ణారెడ్డి, బ్యాంకు రెడ్డెప్ప, కమిటీ సభ్యులు మునస్వామి, లాజర్, చంద్రబాబు, సుదర్శన్, రమేష్, కృష్ణమూర్తి తదితరులున్నారు.

పేద విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆర్థిక సాయం

పుంగనూరు: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ ఆధ్వర్యంలో క్లబ్ ప్రతినిధులు కలసి ఆదివారం పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు. ఉన్నత చదువులు చదువుతున్న ముగ్గురు విద్యార్థులకు రూ.10 వేలు చొప్పున, మరో టైలర్ మణికంఠకు కుట్టుమిషన్‌ను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు సరస్వతి, బాలసుబ్రమణ్యం, రఘునాథరెడ్డి, కేశవరెడ్డి, మహిపాల్‌రెడ్డి, సుధాకర్‌రావు, సురేష్, వరదారెడ్డి పాల్గొన్నారు.